
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 29 జూలై 2024



గరిష్ఠం 31.0
కనిష్ఠం 24.0

ప్రాజెక్టుల్లో నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	510.30 (132.0098)	61,111	6,282
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.20 (3.82)	831.70	471.60
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	103.24 (1.06)	212	నిల్


చికెన్ ధరలు: లైవ్: రూ.135 | డ్రెస్: రూ.210 | స్కిన్‌లెస్: రూ.240



సహకార సంఘాల్లో సీఈవోల పెత్తనం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రాథమిక సహకార సంఘాల్లో ఆధిపత్య పోరు సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 107 పీఏసీఎస్‌లు ఉన్నాయి. చాలా సొసైటీల్లో 30 నుంచి 40 ఏళ్లుగా సీఈవోలు తిష్ట వేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ చైర్మన్లను సైతం లెక్క చేయడం లేదు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు 107 ఏళ్ల చరిత్ర ఉంది. చాలా మంది సొసైటీ చైర్మన్లు రైతుల అభిమానంతో పలుమార్లు ఎన్నికై బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే పలు చోట్ల సీఈవోలే పెత్తనం సాగిస్తూ ముప్పుతిప్పలు పెడుతున్నారని పలువురు చైర్మన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

\- నల్లగొండ



- దశాబ్దాలుగా తిష్ట వేసి ఇష్టారాజ్యం
- డమ్మీలుగా మారామని చైర్మన్ల ఆవేదన
- బదిలీలపై దృష్టి సారించని టెస్కాబ్
- ఎన్నడూ జరగని డీఎల్‌ఈసీ భేటీలు

రైతుల కోసం పీఏసీఎస్‌ల చైర్మన్‌లు పనిచేయాల్సి ఉండగా, ఏళ్లుగా తిష్ట వేసిన సీఈవోలు లెక్కపెట్టకపోవడంతో వారికి ఎటూ పాలుపోవడం లేదు. ప్రతీ సొసైటీ చైర్మన్ పదవీకాలం ఐదేళ్లు. సీఈవోలు మాత్రం వారు ఉద్యోగ విరమణ చెందేంత వరకు తమను ఎవ్వరూ ఏమీ చేయలేరనే అభిప్రాయంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీంతో చాలా సొసైటీల్లో చైర్మన్లకు, సీఈవోలకు పొసగక సమస్య జటిలంగా మారి సొసైటీల ప్రతిష్ఠ దెబ్బతింటోంది. నాలుగేళ్ల గా డీసీసీబీ రూ.2,200కోట్ల టర్నోవర్‌తో ముందుకు సాగుతుండగా, పీఏసీఎస్‌ల లో మాత్రం కోల్డ్‌వార్‌తో తిరోగమన దిశగా పయనిస్తున్నాయన్న చర్చ సాగుతోంది.



టెస్కాబ్ నిర్ణయంతోనే బదిలీలు

దీర్ఘకాలికంగా సొసైటీల్లో పనిచేస్తున్న సీఈవోల బదిలీతో పాటు అన్ని సొసైటీల్లో బదిలీలపై టెస్కాబ్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. టెస్కాబ్ నుంచి బదిలీల ఉత్తర్వులు వస్తే ఆ ప్రక్రియను నిర్వహిస్తాం. కొన్ని సొసైటీల్లో దీర్ఘకాలికంగా సీఈవోలు ఒకే ప్రాంతంలో పని చేస్తుండటంతో సమస్యలు ఏర్పడిన పరిస్థితులు దృష్టికి వచ్చాయి. బదిలీల ప్రక్రియ మా పరిధిలో లేదు. రాష్ట్ర స్థాయి నుంచి ఆదేశాలు వస్తేనే బదిలీలు ఉంటాయి.

\- ఆర్.కిరణ్‌కుమార్, నల్లగొండ డీసీవో

డీఎల్‌ఈఎస్ భేటీలు కరువు

పీఏసీఎస్ చైర్మన్లు, సీఈవోలకు మధ్య వివాదాలు చోటుచేసుకుంటున్నా డిస్ట్రిక్ లెవల్ ఎంపార్డ్ కమిటీ(డీఎల్‌ఈఎస్) ఎన్నడూ భేటీ కాలేదు. ఈ కమిటీలో డీసీసీబీ చైర్మన్‌తో పాటు సీఈవో, డీసీవో, నాబార్డు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు ఉంటారు. సొసైటీల్లో చైర్మన్లు, సీఈవోల మధ్య ఇబ్బందులు తలెత్తినప్పుడు సమన్వయపర్చడం, అవసరమైతే సీఈవోను ఇతర సొసైటీలకు బదిలీ చేసేందుకు టెస్కాబ్‌కు సిఫారసు చేయడం ఈ కమిటీ విధి. అదేవిధంగా చైర్మన్, సీఈవో మధ్య స్నేహపూర్వక వాతావరణం కల్పించి సొసైటీ ద్వారా రైతులకు మేలు చేకూర్చేలా ఈ కమిటీ వ్యవహరించాలి. అయితే చాలా సొసైటీల్లో సీఈవోలు చైర్మన్ల మాట వినకపోవడంతో పాటు పాలకవర్గాల తీర్మానాలను బుట్టదాఖలు చేస్తున్నారు. చైర్మన్లు చెప్పినా రైతులకు రుణాలు ఇచ్చే విషయాన్ని పట్టించుకోకుండా వారిని సొసైటీల చుట్టూ తిప్పించుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సీఈవోల బదిలీల విషయంలో టెస్కాబ్ నిర్ణయం తీసుకోకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని చాలా పీఏసీఎస్‌లలో సమస్యలు జటిలంగా మారుతున్నాయి. ఇప్పటికైనా డీఎల్‌ఈఎస్ భేటీ నిర్వహించి సొసైటీల్లో పరిస్థితులను అంచనా వేయడంతో పాటు దీర్ఘకాలికంగా తిష్టవేసిన సీఈవోలకు స్థానచలనం కల్పించాలని చైర్మన్లు కోరుతున్నారు.

బదిలీలపై దృష్టి సారించని టెస్కాబ్

వాస్తవానికి పీఏసీఎస్‌ల సీఈవోల బదిలీని టెస్కాబ్ పర్యవేక్షించాలి. హైదరాబాద్‌లోని టెస్కాబ్ అధికారులు ఉమ్మడి జిల్లాలోని డీసీసీబీ, సొసైటీల్లో బదిలీల ప్రక్రియను చూడాల్సి ఉంటుంది. జిల్లా సహకార కేంద్ర బ్యాంకుతో పాటు బ్రాంచ్‌లలో కిందిస్థాయి ఉద్యోగుల నుంచి పైస్థాయి అధికారుల వరకు బదిలీలు చేస్తున్నా, సొసైటీల్లో మాత్రం సీఈవోల బదిలీలపై దృష్టి సారించడం లేదు. దీంతో ఒకే సొసైటీల్లో సీఈవోలు దశాబ్దాలుగా కొనసాగుతుండటంతో చైర్మన్ల నిర్ణయాలను వారు ఖాతరు చేయడం లేదు. కొద్ది రోజుల క్రితం కొన్ని సొసైటీలల పాలకవర్గాలు సీఈవోలను తొలగించాలని తీర్మానాలు చేసి డీసీఈవోతో పాటు డీసీసీబీ సీఈవోకు, టెస్కాబ్‌కు సైతం తీర్మానాలను పంపినా, వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. తాము పదవుల్లో ఉన్నా, తమ మాటను ఖాతరు చేయని ఉద్యోగి రైతులకు ఏం న్యాయం చేస్తారని చైర్మన్లు, డైరెక్టర్లు వాపోతున్నారు. ఇటీవల నల్లగొండలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉమ్మడి జిల్లా మహాజన సభ జరిగిన సమయంలో మూడు జిల్లాల నుంచి పీఏసీఎస్ చైర్మన్లు హాజరయ్యారు. చాలా మంది చైర్మన్లు సీఈవోల వ్యవహార శైలిని ఈ మహాజన సభ దృష్టికి తీసుకెళ్లారు. సీఈవోలతో సొసైటీలు దెబ్బతింటున్నాయని వారు వాపోయారు. అయితే సీఈవోల బదిలీల ప్రక్రియ డీసీసీబీ చేతుల్లో లేదని టెస్కాబ్ దృష్టికి తీసుకెళ్దామని నాడు సర్దిచెప్పారు. సీఈవోల బదిలీపై టెస్కాబ్ వెంటనే నిర్ణయం తీసుకోవాలని చైర్మన్లు కోరుతున్నారు.



వర్షాలతో పెరిగిన సాగు విస్తీర్ణం

భారీ వర్షాలు లేక పుంజుకోని వరి సేద్యం

నల్లగొండ, జూలై 28: జిల్లాలో నాలుగైదు రోజులుగా కురిసిన ముసురుతో కూడిన వర్షాలకు పంటల సాగు విస్తీర్ణం పుంజుకుంది. వానాకాలం ప్రారంభంలో వర్షాలు లేకపోవడంతో పంటల సాగు విస్తీర్ణంపై ప్రభావం చూపింది. జిల్లాలో జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 199.1 మి.మీల వర్షంపాతానికి 254.8మి.మీల వర్షం కురిసింది. 28మి.మీల వర్షపాతం అధికంగా నమోదైంది. ముసురుతో కూడిన వర్షాలతో మెట్ట పంటలకు ప్రధానంగా పత్తి పంటకు జీవం వచ్చింది. అయితే భారీ వర్షాలు లేకపోవడంతో వరి సాగుపై ప్రభావం పడింది. భారీ వర్షాలు లేక దుక్కులు తడవక ఇప్పటి వరకు కేవలం 41,058ఎకరాల్లో మాత్రమే వరి సాగైంది. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వరద వస్తే ఎడమకాల్వకు నీటి విడుదల చేస్తే ఆయకట్టులో పెద్ద మొత్తంలో వరి సేద్యం కానుంది. బోరుబావుల కింద నామమాత్రమే పంటలు సాగయ్యాయి. పత్తి జిల్లాలో 5.40లక్షల ఎకరాలకు ఇప్పటి వరకు 4,48,290 ఎకరాల్లో రైతులు పత్తి విత్తనాలు విత్తారు. వర్షాలు కురవక ముందు 3,46,790 ఎకరాల్లో రైతులు పత్తి విత్తనాలు విత్తారు. కందులు కేవలం 350 ఎకరాల్లో రైతులు సాగుచేశారు.

మూసీకి నిలకడగా కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలతో పాటు మూసీ ఎగువ పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు గత వారం రోజులుగా మూసీలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతూ వస్తోంది. 645అడుగుల (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటి మట్టం ఆదివారం సాయంత్రానికి 643.20 అడుగులు (3.82టీఎంసీ)లుగా నమోదైంది. ఎగువ నుంచి 831.70 క్యూసెక్కుల వరద వస్తుండగా, ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు 471క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఆశాజనకంగా పంటల సాగు



ఇటీవల కురిసిన వర్షాలతో పంటల సాగు ఆశాజనకంగా ఉంది. పత్తి విస్తీర్ణం పుంజుకుంది. ముసురుతో కూడిన వర్షాలు పత్తిచేలకు ఊపిరి పోశాయి. కర్నాటక, మహారాష్ట్రలో కురిసిన వర్షాలతో ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదలు శ్రీశైలంకు, అక్కడి నుంచి నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు చేరుతోంది. సాగర్ ఆయకట్టుతో పాటు ఏఎమ్మార్పీకి నీటి విడుదల జరిగితే వరి సేద్యం భారీగా పెరిగే అవకాశం ఉంది.

\- పి.శ్రవణ్‌కుమార్, నల్లగొండ జేడీఏ

సాగర్‌'కు 61,111 క్యూసెక్కుల వరద

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం ఆదివారం సాయంత్రానికి 510.30 అడుగులకు (132.0098 టీఎంసీలు) చేరుకుంది. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు కుడి గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 27,562 క్యూసెక్కులు, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 33,549 క్యూసెక్కులు మొత్తం మొత్తం 61,111 క్యూసెక్కుల సాగర్‌కు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి కుడి కాలువ ద్వారా 5,882 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 6,282 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 61,111 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ నుంచి ఎడమ, వరద కాలువలకు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ఎటువంటి నీటి విడుదల లేదు.

రెండో విడత రుణమాఫీ రేపే

- రూ.1లక్ష నుంచి రూ.1.50లక్షల వరకు మాఫీ
- ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం



నల్లగొండ, జూలై 28: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రెండో విడత రుణమాఫీకి సన్నాహాలు పూర్తయ్యాయి. ఈనెల 30వ తేదీన రూ.1లక్ష నుంచి రూ.1.50లక్షల వరకు రైతు బ్యాంకు రుణాలు ఈ దఫా మాఫీకానున్నాయి. అందుకు సంబంధించి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మూడు కలెక్టరేట్లలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. హైదరాబాద్‌లోని అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం 12గంటలకు రెండో విడత రుణమాఫీని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులతో పాటు ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. అదేరోజు మధ్యాహ్నం నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలోని కలెక్టరేట్లలో రుణమాఫీ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్లతో పాటు ఆయా జిల్లాల వ్యవసాయశాఖ, సహకారశాఖ అధికారులు, అర్హులైన కొంతమంది రైతులు పాల్గొంటారు. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని విన్న అనంతరం ఉమ్మడి జిల్లాలోని మూడు జిల్లాలకు చెందిన కలెక్టర్లు రెండో విడత రుణమాఫీ సంబరాలను రైతుల సమక్షంలో ఘనంగా నిర్వహిస్తారు. ఈనెల 18వ తేదీన మొదటి విడత రుణమాఫీ సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించగా అందులో మంత్రులతో పాటు రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అదేవిధంగా రైతు వేదికల్లో కూడా సంబరాలు నిర్వహించారు. తొలి విడతలో నల్లగొండ జిల్లాలో 83,124మంది రైతులకు చెందిన రూ.454కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. సూర్యాపేట జిల్లాలో 56,274మంది రైతులకు చెందిన రూ.282కోట్లకు పైగా రుణాలు మాఫీ కాగా, యాదాద్రి జిల్లాలో 37,285మంది రైతులకు చెందిన రూ.203కోట్లకు పైగా రుణమాఫీ పూర్తయింది.

ప్రభుత్వ బడులను కాపాడుకుందాం: డీఈవో

నార్కట్‌పల్లి, జూలై 28: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యను బోధిస్తున్న ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందామని జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి పిలుపునిచ్చారు.



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈవో భిక్షపతి

కలెక్టర్ నారాయణరెడ్డి సూచన మేరకు మండలంలోని బీ.వెల్లెంల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఈవో మాట్లాడుతూ, ఉచిత విద్య, పుస్తకాలు, భోజనం, యూనిఫాం, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో కార్పొరేట్ హంగులతో ఉన్న బీ.వెల్లెంల ప్రభుత్వ పాఠశాల జిల్లాకు మోడల్‌గా గుర్తింపు పొందాలన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చొరవతో ఈ పాఠశాలను అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు. ఆధునిక విద్య కోసం డిజిటల్ క్లాసులు ఏర్పాటుచేశామన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే బాధ్యత అందరిపై ఉందని, ఉత్తమ ఫలితాలు సాధించే బాధ్యతను తాము తీసుకుంటామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, ఎంఈవో కూకుట్ల నర్సింహ, కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చిరుమర్తి ధర్మయ్య, బొడిగె నర్సింహ, నల్లబోతు సత్తయ్య, హెచ్‌ఎం కృష్ణారెడ్డి, బొడిగె స్వామి, సోమనబోయిన యాదయ్య, చెరుపల్లి రఘుపతి, ఎస్సీ బాలికల హాస్టల్ వార్డెన్ సౌజన్య ముంత అనిత, మోదుగు శేఖర్‌రెడ్డి, కొంపల్లి సైదులు, పున్న నాగార్జున, మేడి వెంకన్న, చిరుమర్తి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేస్తే చర్యలు

నల్లగొండ, జూలై 28: బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి హెచ్చరించారు. ఆదివారం రాత్రి నల్లగొండ పట్టణ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేస్తున్నవారిని గుర్తించి కేసు నమోదుచేసి,వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేయడం, రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలతో రోడ్లపై హల్‌చల్ చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేస్తే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఆయన వెంట వన్‌టౌన్, టూటౌన్ సీఐలు వేమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, డానియల్, ఎస్ఐలు ఉన్నారు.


టూటౌన్ ఎస్ఐ-2గా మానస బాధ్యతల స్వీకరణ

నల్లగొండ టూటౌన్ ఎస్ఐ-2గా జి.మానస ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. 2018లో ఎస్ఐగా ఎంపికైన ఆమె ప్రస్తుతం పోలీస్ జిల్లా కేంద్రంలోని ట్రిబుల్ సీఎస్‌లో పనిచేస్తూ టూటౌన్ ఎస్ఐ-2గా బదిలీ అయ్యారు.

మాడ్గులపల్లి: రాత్రివేళల్లో యువకులు రోడ్లపై మద్యపానం చేసి గుంపులు గుంపులుగా తిరుగుతున్నారని, వారిపై వ్యక్తులపై కేసు నమోదు చేస్తామని ఎస్ఐ శోభన్‌బాబు హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడారు.

పెరిక కుల కార్పొరేషన్‌కు రూ.50కోట్లు

దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య



దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేనిని సన్మానిస్తున్న కుల సంఘం ప్రతినిధులు

నల్లగొండ, జూలై 28: పెరిక కుల కార్పొరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించిందని దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, నల్లగొండ మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పెరిక కుల భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పెరిక కుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడమేగాక, రాష్ట్ర బడ్జెట్‌లో రూ.50కోట్లు కేటాయించడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ముత్తినేని వీరయ్య, రమేష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెరిక (పురిగిరి క్షత్రియ) కుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్తినేని శ్యాం సుందర్, నాయకులు కోట మల్లిఖార్జున్‌రావ్, కొనకంచి వీర రాఘవులు, దాసరి మల్లేష్, వటిశెట్టి సత్యనారాయణ, వీర్ భాస్కర్, శ్రీనివాస్, ఆనంద్, వెంకటరమణ, రాంబాబు, కృష్ణయ్య, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లేష్ మాదిగ



దేవరకొండలో కరపత్రాలు విడుదల చేస్తున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు

దేవరకొండ, జూలై 28: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ముదిగొండ ఎల్లేష్ మాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఆగస్టు 6న ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే దీక్ష కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదిగలు విద్య, రాజకీయం, ఉద్యోగ అవకాశాలులేక అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదం తెలపాలని, లేని పక్షంలో లక్షల మంది మాదిగలతో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పొట్ట మురళి, మద్దిమడుగు రవి, దర్శనం విష్ణు, సైదులు, వెంకటయ్య, నర్సింహ, విజయ్ పాల్గొన్నారు.

యూజీడీ పనులు సకాలంలో పూర్తి చేయాలి

మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి



యూజీడీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

రామగిరి, జూలై 28: పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూసీడీ), సీసీ రోడ్ల పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 19వ వార్డు శ్రీనివాసకాలనీ, ఎన్జీవోస్‌కాలనీ, నందీశ్వరకాలనీలో అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రానున్న ఎనిమిది నెలల వ్యవధిలో పట్టణంలోని అన్ని వార్డుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేస్తామన్నారు. యూజీడీ పనులు పూర్తయ్యాక సీసీ పనులను ప్రారంభిస్తామన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. యూజీడీ పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా కాలనీ వాసులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గోగుల రాములమ్మ, కాలనీ వాసులు కోమటిరెడ్డి నమీరెడ్డి, యడవల్లి అంజయ్య, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, సంపత్‌నాయుడు, పబ్లిక్ హెల్త్ ఏఈ నాగప్రసాద్, ఇంజనీర్ చక్రవర్తి, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మాస్టర్ వీవర్ల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు




చండూరులో ప్రింటెడ్ చీరలను దహనం చేస్తున్న చేనేత కార్మికులు

చండూరు, జూలై 28: చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాస్టర్ వీవర్ల సంఘం అధ్యక్షుడు తిరందాసు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్లు నిర్వహించిన చేనేత మహార్యాలీలో ఆయన మాట్లాడారు. తొలుత మార్కండేయ దేవాలయం నుంచి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ, ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ప్రింటెడ్ చీరలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ వాటిని దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు, పలువురు చేనేత నాయకులు మాట్లాడుతూ, 11 నెలలుగా త్రిఫ్ట నిధులు రావడం లేదని, ఎనిమిది నెలలుగా నిలిచిన చేనేత మిత్ర నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిల్వ ఉన్న వస్త్ర నిల్వలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల లబ్ధిదారులకు ప్రభుత్వం చేనేత చీరలను పంపిణీ చేయాలన్నారు. చేనేత రుణమాఫీ ప్రకటించాల ని, రూ.2లక్షలు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వయసుతో సంబంధం లేకుండా బీమా అమలు చేసి, చేనేత రంగానికి బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చేనేత పరిరక్షణ సేవాసమితి అధ్యక్షుడు రాపోలు ప్రభాకర్, డీసీసీబీ డైరెక్టర్ జూలూరు శ్రీనివాసులు, మునిసిపల్ కౌన్సిలర్ చిలుకూరి రాధిక, గంజి యాదగిరి, కందగట్ల భావనారుషి, రావిరాల నగేష్, కర్నాటి శ్రీనివాసులు, పులిపాటి ప్రసన్న, రావిరాల శ్రీను, చెరుపల్లి కృష్ణ, అంజయ్య, చిట్టిప్రోలు వెంకటేశం, దుస్స గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ శుభాకాంక్షలకు
మీ కుటుంబ సభ్యులలో, మీ బంధుమిత్రులలో,
మీ సహోద్యోగులలో ఎవరైనా
పదవీ విరమణ చేస్తున్నారా?
అయితే వారికి తీపి గుర్తుగా ఆంధ్రజ్యోతి ద్వారా
అందించండి పదవీ విరమణ శుభాకాంక్షలు



ఆంధ్రజ్యోతి ఇస్తోంది
25% రాయితీ
నోట్: ఈ రాయితీ ఇయర్ ప్యానల్ యాడ్‌లకు వర్తించదు
వివరాలకు:
ఆంధ్రజ్యోతి ప్రకటనల విభాగం
నల్లగొండ : 99854 13656, 99854 13365
సూర్యాపేట : 97036 18713
కోదాడ : 80967 10822
దేవరకొండ, మిర్యాలగూడ, భువనగిరి, చౌటుప్పల్ : 99854 10384
ఆంధ్రజ్యోతి కార్యాలయం
అద్దంకి బైపాస్ రోడ్, ఆర్జాలబావి, నల్లగొండ, సెల్ : 9985410384

ఎక్సైజ్ అధికారుల దాడులు

దేవరకొండ, జూలై 28: నల్లగొండ జిల్లా నేరుడుగొమ్మ మండలంలో ఆదివారం దేవరకొండ ఎక్సైజ్‌శాఖ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఆటోలో తరలిస్తున్న 15 బస్తాల నల్ల బెల్లం, పట్టిక 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం పరుచుకున్నట్లు సీఐ తెలిపారు. బెల్లం, నాటుసారా, తరలిస్తున్న శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.



జైపాల్‌రెడ్డి ఘాట్‌వద్ద నివాళి అర్పిస్తున్న సుఖేందర్‌రెడ్డి, చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు

జైపాల్‌రెడ్డికి ఘన నివాళి

నల్లగొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దివంగత నేత కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని స్ఫూర్తిస్థల్‌లో జైపాల్‌రెడ్డి ఘాట్ వద్ద శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి పాల్గొని నివాళులర్పించారు .

స్నేహమంటే ఇదేరా..!

● స్నేహితురాలికి రక్త చిత్రంతో జన్మదిన శుభాకాంక్షలు ● నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో ఘటన

నార్కట్‌పల్లి, జూలై 28: వాళ్లిద్దరూ మంచి స్నేహితులు... ప్రాంతాలు వేరైనా స్నేహం వారిని ఒక్కటి చేసింది... ఇద్దరూ ఒకే కాలేజీలో మెడిసిన్ చదువుతున్నారు. వీరిలో ఓ స్నేహితురాలి పుట్టినరోజు సందర్భంగా వినూత్నంగా శుభాకాంక్షలు తెలిపి స్నేహబంధాన్ని ఆమెపై ఉన్న అమితమైన స్నేహాన్ని చాటుకుంది మరో స్నేహితురాలు. వివరాల్లోకి వెళితే నిజామాబాద్ జిల్లాకు చెందిన గాదపాక శ్రియ, నార్కట్‌పల్లి మండలం మాంద్ర గ్రామానికి చెందిన గుండు అంజలి నార్కట్‌పల్లి కామినేని వైద్య విద్య కళాశాలలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్నారు. ఇద్దరూ మంచి స్నేహితులు. ఈ నెల 28వ తేదీన అంజలి పుట్టినరోజు సందర్భంగా స్నేహితురాలికి ఎప్పటికీ గుర్తుండుపోయే బహుమతిని వినూత్నంగా ఇవ్వాలని శ్రియ అనుకుంది. దీంతో నల్లగొండలోని ఓ గిఫ్ట్ షాపును ఆశ్రయించింది. ఇందుకోసం 14ఎంఎల్ రక్తం ఇచ్చిన అంజలి తాను శ్రియ కలిసి ఉన్న ఫొటో మాదిరి తన రక్తంతో గీయించింది. ఆ చిత్రాన్ని ఇంటికి వచ్చి పుట్టినరోజు కానుకగా అందించి ఆశ్చర్యపరిచింది. స్నేహబంధాన్ని రక్తబంధంగా మార్చి శ్రియ చూపిన అభిమానాన్ని అంజలితో పాటు ఆమె కుటుంబసభ్యులు పొంగిపోయారు.



తన రక్తంతో గీయించిన చిత్రపటాన్ని అంజలికి అందజేస్తున్న శ్రియ(ఫొటోలో ఎడమవైపు)

హామీలను వెంటనే అమలు చేయాలి : వంగూరి

నల్లగొండ రూరల్, జూలై 28: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశాల వర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా స్థాయి శిక్షణా తరగతులను స్థానిక దొడ్డికొమరయ్య భవనంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనం రూ. 18వేలకు బడ్జెట్ నిర్ణయించి అమలు చేయాలన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆశాలకు రూ.50లక్షలు ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 30 జరిగే చలో హైదరాబాద్‌ను ఆశా కార్యకర్తలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.మహేశ్వరి, టి.వెంకటమ్మ, పెంజర్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరికొండపై భక్తుల సందడి



ప్రాకార మండపంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జూలై 28: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులతో యాదగిరికొండపై సందడి నెలకొంది. వారాంతపు సెలవు దినం కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వాహనాలపై తరలివచ్చారు. సుమారు 15వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తుల రద్దీ కొనసాగింది. ప్రత్యేక దర్శనాలకు అరగంట ధర్మదర్శనాలకు గంట సమయం పట్టింది. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాల వద్ద భక్తులు కూడా భక్తులతో కోలాహలంగా మారింది. అదేవిధంగా భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.23,53,996 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణపర్వాలు వైభవంగా చేపట్టారు. అదేవిధంగా పాతగుట్ట స్వామి అమ్మవారలకు నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమ రీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు. కాగా, ప్రతీ ఆదివారం నిర్వహించే సంగీత కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన నయమిశారణ్య పీఠాధిపతి శ్రీ బాలబ్రహ్మానంద సరస్వతి ప్రవచనాలు చేశారు.

ఆటో బోల్తా .. ఐదుగురికి గాయాలు

నిడమనూరు, జూలై 28: కూలీలతో వెళ్తున్న ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడటంతో ఐదుగురు మహిళా కూలీలు గాయపడ్డారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం బొక్కమంతల పహాడ్ సమీపంలోని ఆముదాల మిల్లు వద్ద ఆదివారం రాత్రి జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం నూరేపల్లి గ్రామానికి చెందిన 17 మంది మహిళా కూలీలు త్రిపురారం మండలం కామారెడ్డిగూడెంలో వరినాటు వేసేందుకు ఆదివారం ఉదయం ఆటోలో వెళ్లారు. తిరిగి సాయంత్రం అదే ఆటోలో గ్రామానికి వెళ్తుండగా బొక్కమంతలపహాడ్ సమీపంలోని ఆముదాల మిల్లు వద్దకు రాగానే రోడ్డుపై ఉన్న గేదెను ప్రమాదవశాత్తు ఢీకొనడంతో ఆటో పల్టీ కొట్టడంతో పాటు రోడ్డు పక్కన ఉన్న పంట కాల్వలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న మన్నెపల్లి వీరమ్మ, భవాని, మల్లమ్మ, వెంకటమ్మ, పావని అనే ఐదుగురు మహిళా కూలీలు గాయపడ్డారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ గోపాల్‌రావు హుటాహుటిన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదంలో గాయపడిన కూలీలను 108 అంబులెన్స్ వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స అందిస్తున్నారు. కాగా పంట కాల్వలో పడిపోయిన ఆటోను ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీశారు. చీకట్లో రోడ్డుపై ఉన్న గేదె కనిపించకపోవడంతోనే ప్రమాదం జరిగినట్లు ఆటోలో ఉన్న మహిళలు తెలిపారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు.

SUPER HIT నేడే చూడండి



సుదర్శన్ 35ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.30,6.00,9.15
తారకరామ 70ఎంఎం - కాచిగూడ 11.15,6.00
GLOBAL CINEMAS RELEASE

FAMILY ENTERTAINMENT విజయవంతమైన 6వ వారం



శ్రీనివాస 70ఎంఎం - నర్సాపూర్ 11.00,2.00,6.00,9.00
PARAM JYOTHI FILMS 9848028739

UNANIMOUS EPIC BLOCKBUSTER
విజయవంతమైన 5వ వారం
తగ్గించబడిన టికెట్ రేట్స్: మల్టీప్లెక్స్: 295/-, 350/-, సింగిల్ స్క్రీన్: 175/-,110/-, 50/-




సంధ్య 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.15,6.00,9.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
GLOBAL CINEMAS RELEASE

ఆగస్టు 2న బ్రహ్మాండమైన విడుదల



ఆగస్టు 2న బ్రహ్మాండమైన విడుదల



SKML MOTION PICTURES THRO GANESH BHARI 9299992173, 9296509333



సంధ్య 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.00,6.00,9.00
SRI VIJAYA FILMS

ఆగస్టు 2న బ్రహ్మాండమైన విడుదల



లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్
SUCHIN CINEMAS THRO NTR CINEMAS 9030161717

ఆగస్టు 2న బ్రహ్మాండమైన విడుదల



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్
SURAKSHA ENTERTAINMENT MEDIA 9133164555, 9912392111

మల్టీప్లెక్స్: 150/-, సింగల్ స్క్రీన్: 110/- 80/- 50/-



సప్తగిరి 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ | లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్ | అంజలి 70 ఎ/సి - సికింద్రాబాద్ | తార్నాక కాంప్లెక్స్ - ఇ.సి.ఐ.ఎల్
MYTHRI MOVIE DISTRIBUTORS LLP

అధిక వర్షాలతో పంటలకు

తెగుళ్లు-సస్యరక్షణ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆరు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలలో వివిధరకాల సమస్యలు తలెత్తే అవకాశంఉంది. ఈ సమయంలో పంటల సంరక్షణ చాలా ముఖ్యం. పంటల్లో రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కంపసాగర్ శాస్త్రవేత్త చంద్రశేఖర్ వివరించారు.

- మిర్యాలగూడ(వ్యవసాయం)

పొలాల నుంచి మురుగు నీరు నిల్వలేకుండా తీసివేయాలి

మూడు రోజుల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పొలాల్లో మందుల పిచికారీ వాయిదావేయాలి.

వరి సాగులో



● నీరు సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో రైతులు స్వల్పకాలిక(120-125 రోజులు) వరి రకాల నారుమళ్ల ఈ నెల 31వ తేదీ వరకు పోసుకోవచ్చు.

● దీర్ఘకాలిక వరి రకాల నారు బాగా ముదిరి(50రోజుల వయస్సు) ఆలస్యంగా నాటితే ఆకుల చివర తుంచి కుదురుకు సుబ్బాను పెంచాలి. కుదురుకు 6-8 మొక్కల చొప్పున నాటుకోవాలి.

● నత్రజని ఎరువులను సిఫారసు కంటే 25శాతం పెంచి మూడు దఫాలుగా 70శాతం నాటేసమయంలో మిగతా 30శాతం అంకుర దశలో వేయాలి.

● వరి నాట్లు వేసుకునే వారం రోజుల ముందు ఎకరాకు సరిపోయే నారు మడికి 800గ్రాముల కార్బోప్యూరాన్ 3జీ గుళికలను ఇసుకలో కలిపి చల్లితే ప్రధాన పొలంలో పంటను 15-20 రోజుల వరకు కాండంతొలుచు పురుగుల నుంచి కాపాడుకోవచ్చు.

● ఇప్పటివరకు నారు పోయని రైతాంగం వర్షాలను సద్వినియోగం చేసుకుని పొలాలను దమ్ము చేసి పొలంలో నేరుగా విత్తే పద్ధతిని ఎంచుకోవడం వల్ల సమయంతో పాటు ఖర్చులు ఆదా చేసుకోవచ్చు.

● నాట్లు పెట్టిన తరువాత ప్రతీ 2 మీటర్లకు కాలి బాటను తీయడం వల్ల గాలివెలుతురు బాగా ప్రసరించి సుడి దోమ ఉధృతిని నివారించవచ్చు.

● ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ఎకరానికి 10 కిలోల కార్బోప్యూరాన్ 3జీ గుళికలను నాటిన 10 నుంచి15 రోజుల మధ్య వేసుకోవడం ద్వారా కాండం తొలుచు పురుగు, ఉల్లికోడును నివారించవచ్చు.

పత్తి సాగులో



● వర్షాలు తగ్గిన తరువాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రసాయన ఎరువులను పైపాటుగా 20-40 రోజుల వయస్సు పంటకు మొక్క మొదళ్లలో 7-10 సెంటీమీటర్ల దూరంలో పాదులు తీసి ఎరువును వేసి మట్టి వేయాలి.

● ముందుగను గుర్తిన పంట త్వరగా కోలుకోవడానికి 19:10:19 లేదా 13-0-45, లేదా యూరియా 10గ్రాములు లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

● నేల ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా కార్బండిజమ్+మ్యాంకోజెబ్ శిలీంధ్రనాశక మందును లీటర్ నీటికి కలిపి నేల బాగా తడిసేట్లు వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

● పత్తి పంటలో వచ్చే గడ్డి జాతి, వెడల్పాకు కలుపు మొక్కల నివారణకు(2-3ఆకుల దశలో)క్విజలోఫాప్ ఇథైల్, పైరిథయోబ్యాక్ సోడియం కలుపు మందులను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కంది సాగులో : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కంది పంటకు ఎండు తెగులు ఆశించడానికి అనుకూలంగా ఉంటుంది. నివారణకు మెటలాక్సిల్ మందును లీటరు నీటికి కలిపి నేలను తడపాలి.

వేరుశనగ సాగులో: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వేరుశనగలో మొదలుకుళ్లు తెగులు ఆశించేందుకు అవకాశం ఉంటుంది. తెగులు నివారణకు మొక్క దగ్గర కార్బండిజమ్, మ్యాంకోజెబ్ 2గ్రాము మందును లీటర్ నీటికి కలిపి నేలను తడపాలి.

కూరగాయలు

● టమాట, వంగ మిరప, బెండి పంటల నారుమళ్లలో నారు కుళ్లు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాముల మందును లీటర్ నీటికి కలిపి నేల పూర్తిగా తడిచేటట్టు పిచికారీ చేయాలి.

● కూరగాయల పంటల్లో ఆకుమచ్చ తెగులు సోకేందుకు ప్రస్తుత కాలం అనుకూలం. నివారణకు కార్బండిజమ్ ఒక గ్రాము, లేదా ప్రొపికొనజోల్ మందును లీటర్ నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.



నారుమడి.. కీలకం

విత్తన ఎంపికలో జాగ్రత్త సుమీ

వరి సాగులో ప్రధానంగా నారు మడి కాలం కీలకం. సాగు ప్రారంభించే కాలాన్ని బట్టి నారుమడిని ఎంపిక చేసుకోవాలి. అదేవిధంగా నీటివసతి, ప్రాంతాన్ని బట్టి చీడపీడలను తట్టుకునే వరి విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలి. ఆయా విత్తనాల కాలపరిమితిని బట్టి నారుపోసుకోవాలి. జూన్‌లో అయితే దీర్ఘకాలిక(140 రోజులు) రకాలు, జూన్ తర్వాత మధ్య స్వల్పకాలిక(110 నుంచి 135 రోజులు) రకాలు, జూలై 18 వరకు స్వల్పకాలిక రకాలు, జూలై నెల చివరివరకు నారు పోసుకోవచ్చు. ఎకరా సాగుకు సన్నరకం 20 కిలోలు వాడాలి. దొడ్డు రకానికి 25 కిలోలు వాడాలి.

- భువనగిరి రూరల్

విత్తనశుద్ధి తప్పనిసరి

నారుపోసే ముందు తడి విత్తన శుద్ధికి కార్బండిజమ్ ఒక గ్రాము, పొడి విత్తనశుద్ధికి 3 గ్రాముల మందును కిలో విత్తనానికి కలిపి విత్తుకోవాలి.

చల్లుకోవడంలో మెళకువలు

విత్తనం పత్తుగా చల్లుకుంటే నారు బలహీనంగా పెరుగుతుంది. విత్తనం పలచగా చల్లాలి. మొలకకట్టాక చల్లి వారంరోజులు ఆరు తడులు, మొక్క దశలో పలుచగా నీరు ఉంచాలి.

జింకు లోపాన్ని గమనించాలి

జింకు లోపనివారణకు లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ కలిపిన ద్రావణ్ని పిచికారీ చేయాలి. మెట్ట నారుమడిలో ఇనుపధాతు లోపాన్ని గుర్తించి సవరించాలి. పంట ఎదుగుదలను మేరకు 2 గ్రాముల నుంచి 5 గ్రాముల అన్నభేది 0.5 నుంచి ఒక గ్రాము నిమ్మ ఉప్పు లీటరు నీటితో పిచికారీ చేయాలి. నాట్లు ఆలస్యమయ్యే పరిస్థితుల్లో రెండో దఫా నత్రజని ఆలస్యంగా వేసి నారు ముదురుకుండా చూడాలి.

కలుపు నివారణ

నారుమడిలో రెండురోజుల్లో ప్రిటిలాక్లోర్ 50శాతం ఈసీ 2 మిల్లీమీటర్లు ఒక లీటరు నీటిలో కలపాలి. ఎకరాకు 400 మిల్లీలీటర్లు చల్లుకోవాలి. 3నుంచి 5 రోజుల్లో పైరజోసల్ఫూరాన్ ఇథైల్ 10 శాతం డబ్ల్యూపీ 80గ్రాములు ఎకరాకు వేసుకోవాలి. 10 నుంచి 20 రోజుల్లో బిస్పైరిబాక్ సోడియం 100మిల్లీలీటర్లు ఎకరాకు పిచికారీ చేసుకోవాలి.అవసరం మేరకు నారుమడికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నాటువేసిన పొలంలో 3 నుంచి 5 రోజుల్లో పైరజోసల్ఫూరాన్ ఇథైల్ 80గ్రాములు ఎకరాకు, 15నుంచి 20 రోజుల్లో సైహలోపాస్‌బ్యూటైల్ 10శాతం ఈసీ 400 మిల్లీలీటర్లు ఎకరాకు చల్లుకోవాలి.

ముందు జాగ్రత్తలు

నాట్లు వేయడానికి 15రోజులు ముందు పచ్చిరొట్టను, ట్రాక్టర్లతో 15 సెంటీమీటర్ల లోతుగా దమ్ము చేసుకోవాలి.ఎరువుల 36-24-24ఎన్‌పీకేలు అనగా ఎకరాకు 80 కిలోల యూరియా మూడుదఫాలుగా, సింగ్ సూపర్ పాస్పేట్ 150కిలోలు, 40 కిలోల పొటాష్ రెండు దఫాలుగా నాట్లు వేశాక చల్లాలి.

వరిసాగులో విత్తనశుద్ధి తప్పనిసరి



వరిసాగులో విత్తనశుద్ధి తప్పనిసరి. నీటివసతి మేరకు చీడపీడలను తట్టుకునే విత్తన ఎంపికతో అధికదిగుబడి అవకాశం.నారుపోసుకొనే కాలంగా చలిత చేసుగా ఏపుగా పెరుగుతుంది.

డాక్టర్ అనిల్‌కుమార్, ప్రధాన శాస్త్రవేత్త ఎరువుల కేంద్రం, యాదాద్రి భువనగిరి జిల్లా

జోరుగా ఇసుక అక్రమ రవాణా

● ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పునకు రూ.3500 నుంచిరూ.4200 ● యథేచ్ఛగా ఇసుక డంపులు ● పట్టించుకోని అధికారులు



మూసీ నదిలో నుంచి ఇసుకను తోడుతున్న ట్రాక్టర్ (ఫైల్)

మిర్యాలగూడ రూరల్, జూలై 28: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలో అధికారులు హెచ్చరికలు జారీ చేసినా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. మండల పరిధిలోని పాలేరు, మూసీ వాగుల పరివాహక గ్రామాలైన తడకమళ్ల, తక్కెళ్లపాడు, కాల్వపల్లి, అలగడప, రుద్రారం గ్రామాల నుంచి ఇసుక రవాణా అడ్డగోలుగా సాగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అనుమతులతో కూడిన ఇసుక రవాణా కంటే అక్రమంగా తరలించే ఇసుకకు డిమాండ్ పెరిగిందని పలువురు పేర్కొంటున్నారు. ఆన్‌లైన్ ద్వారా అలస్యమవుతుండని అక్రమ దందా నిర్వాహకులను ఆశ్రయించేలా బిల్డర్లు, కాంట్రాక్టర్లు ఇంటి నిర్మాణ యజమానులకు ఉచిత సలహాలిస్తూ వారి పర్మంటేజీలు అందుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణ పనులు మధ్యలో పనులు నిలిచిపోకుండా ఉంటే అదనంగా డబ్బులు చెల్లించి మరీ ఇసుకను కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు దాపురించాయి.

అనుమతులు అంతంత మాత్రమే

మండల పరిధిలోని తక్కెళ్లపాడు, తడకమళ్ల ప్రాంతాల నుంచి ఆన్‌లైన్ ఇసుక అనుమతులను నిలిపివేశారు. దీంతో వేములపల్లి మండలంలోని కామేపల్లి, రావులపెంట నుంచి ఆన్‌లైన్ ద్వారా రూ.3500కు మిర్యాలగూడ ప్రాంతానికి ఇసుక రవాణా చేపడుతుండగా గృహ నిర్మాణ యజమానులు, బిల్డర్లు ఆన్‌లైన్ రవాణాపై నిరాసక్తత కనబరుస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో ఆక్రమార్కులకు అవకాశం కలిసి వస్తుండటంతో కాల్వపల్లి, అలగడప, తక్కెళ్లపాడు, రుద్రారం గ్రామాలతో పాటు పట్టణంలోని ఈదులగూడెం ప్రాంతంలో ఇసుకను డంపింగ్ చేసుకొని వెంచర్లలో గృహ నిర్మాణాలకు పట్టపగలే జోరుగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. కళ్లముందే ఈ తతంగం సాగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.3500 నుంచి రూ.4200 వరకు ధరను నిర్ణయిస్తూ దందా సాగిస్తున్నారు. రాజకీయ పలుకుబడి కోసం ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నాయకులతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఇసుక అక్రమ దందాపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ రవాణా చేపడితే కఠిన చర్యలు

అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మూసీ, పాలేరు వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై ఇప్పటికే చర్యలు చేపట్టామని, తిరిగి ఇసుక దందాను కొనసాగిస్తే సహించేది లేదు.

నరేష్, ఎస్ఐ, మిర్యాలగూడ రూరల్

బాస్కెట్‌బాల్ పోటీలో ప్రతిభ



బాస్కెట్‌బాల్ పోటీలో పాల్గొన్న సురేష్‌నాయక్

తిరుమలగిరి(సాగర్), జూలై 28: తమిళనాడులోని కోయంబత్తూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో రంగుండ్ల తండాకు చెందిన దరావత్ సురేష్‌నాయక్ ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 25 నుంచి 27 వరకు ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైనల్ పోటీలో తెలంగాణ జట్టు, కర్నాటక జట్టు తలపడగా హోరాహోరీగా జరిగిన ఈ పోటీలో తెలంగాణ జట్టు ద్వితీయ స్థానంలో గెలుపొందింది. అయితే ఈ పోటీల్లో ఫైనల్ చేరడంలో, ఈ టోర్నీలో పలు జట్లపై గెలుపొంది ఫైనల్‌కు చేరడంలో సురేష్‌నాయక్ ఎంతో ప్రతిభ కనబరిచాడు. ఇతను దివ్యాంగుల బాస్కెట్‌బాల్‌తోపాటు క్రికెట్ పోటీల్లో రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణిస్తూ తెలంగాణ జట్టు పలు పోటీల్లో గెలుపొందేందుకు కీలకపాత్ర పోషిస్తున్నాడు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో సురేష్ రాణిస్తుండడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

నా పర్సు ఇవ్వు.. ఇంటికి వెళ్లాలి

● మహిళ సంచిలో పర్సు చోరీ ● వెంటపడి పట్టుకున్న మహిళ

నేరేడుచర్ల, జూలై 28: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డు బస్టాప్ వద్ద మహిళ సంచిలో నుంచి పర్సును ఒక ఆగంతకుడు దొంగిలించాడు. ఆదివారం సాయంత్రం మహిళ బస్సు ఎక్కుతుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ రవీంద్రనాయక్, బాధిత మహిళ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిలుకూరు మండలం జేరిపోతుల గ్రామానికి చెందిన చిమట భవాని పాలకవీడు మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలకు ఆదివారం వెళ్లింది. భవాని కుమార్తె 8వ తరగతి చదువుతూ హాస్టల్‌లో ఉండటంతో అక్కడికి వెళ్లింది. తిరిగి సాయంత్రం నేరేడుచర్లకు చేరుకుంది. నేరేడుచర్లలో పండ్లు తీసుకుని బస్సు ఎక్కుతుండగా వెనుక నుంచి వచ్చిన నల్లగొండకు చెందిన సంపంగి రవి పర్సు దొంగిలించాడు. సంచి వస్తువులన్నట్టుగా అనిపించి వెనుకకు తిరిగి చూసే సరికి పర్సు తీసుకొని వెళుతున్న దొంగను గుర్తించి వెంటనే వెంబడించింది. అతను పారిపోతూ సమీపంలోకి ఉండేందుకు ప్రక్కనే ఉన్న హోటల్‌కు వెళ్లాడు. అక్కడ అతన్ని గుర్తించి అన్నా నా పర్సు ఇవ్వు, అందులో ఆధార్‌కార్డు ఉంది. నేను ఇంటికి వెళ్లాలి అంటూ వేడుకుంది. కానీ దొంగ మాత్రం నేను దొంగను కాదంటూ వాదనకు దిగాడు. అక్కడే ఉన్న మరో వ్యక్తి అతని జేబులు గాలించినా పర్సు దొరకలేదు. దొంగ తెలివిగా టైట్ పాయింట్ వేసి ఉండడంతో పాయింట్‌లోకి వేశాడు. అది మోకాలు సమీపంలో చేరుకొని ఆగిపోయింది. బాధిత మహిళ గుర్తించడంతో అక్కడే ఉన్న వ్యక్తి అతని పాయింటు నుంచి పర్సు బయటకు తీశాడు. అతన్ని పట్టుకొని పరిసర ప్రాంతవాసులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అతన్ని పట్టుకొని స్టేషన్‌కు తీసుకు వచ్చి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తిప్పర్తి, జూలై 28: పాము కాటుకు గురై చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లగట్టలగూడెం గ్రామానికి చెందిన ఏపూరిరెడ్డి వెంకటరెడ్డి (50) వ్యవసాయ పనుల నిమిత్తం బావి వద్దకు వెళ్తుండగా ఈ నెల 22న పాము కాటుకు గురయ్యాడు. వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించగా గత కొన్ని రోజులుగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వెంకటరెడ్డికి భార్య, కుమారుడు ఉన్నారు. ఈమేరకు మృతుడి కుమారుడు విజేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా వెంకటరెడ్డి కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్ రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నేతలు పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

చింతపల్లి, జూలై 28: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది.స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం వింజమూర్ గ్రామపంచాయతీలోని ధైర్యపురి తండాకు చెందిన రమావత్ కేశవులు(60) దుకాణానికి వెళ్లి రోడ్డు దాటుతుండగా మల్లేపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కేశవులు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయంపై చింతపల్లి ఎస్ఐ యాదయ్యను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గోశాలకు గోవుల తరలింపు

చండూరు రూరల్, జూలై 28: నల్లగొండ జిల్లా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామంలో యుగతులసి ఆధ్వర్యంలో 2022 సంవత్సరంలో ఏర్పాటు చేసిన గోశాలను గోపాలకుల కొరత, నిర్వహణ పరమైన సమస్యలు తలెత్తడంతో మూసివేశారు. ఇందులో ఉన్న 170 గోవులను ఆదివారం హైదరాబాద్‌లోని యుగ తులసి గో మహా క్షేత్రానికి తరలించినట్లు యుగ తులసి చైర్మన్ కె. శివకుమార్ తెలిపారు.

చిలుకూరులో పెట్రోల్ దొంగలు

చిలుకూరు, జూలై 28: సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో రోడ్డు సమీపంలో నిలిపిన వాహనాల్లోంచి పెట్రోల్‌ను దొంగతనం చేస్తున్న సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. బస్టాండ్ సెంటర్‌లోని మూడు ఇళ్లలోని ఎదిమిది బైకుల్లో పెట్రోల్ దొంగతనం చేశారు. ఇంటి బయట పార్క్ చేసిన బైకుల్లో పెట్రోల్ తీసి పెట్రోల్ దొంగతనం చేస్తున్నారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఆదివారం ఫిర్యాదు చేశారు.

మొబైల్ ఫోన్ అప్పగింత

నార్కట్‌పల్లి, జూలై 28: ఏమరుపాటున బస్టాండ్‌లో ఓ ప్రయాణికుడు తన మొబైల్ ఫోన్‌ను మరిచిపోగా నార్కట్‌పల్లి ఆర్టీసీ సిబ్బంది దాన్ని తిరిగి అతనికి అందజేశారు. వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన నాగేందర్ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి నల్లగొండకు వెళ్లేందుకు నార్కట్‌పల్లి బస్టాండ్‌లో బస్సు రాక కోసం కూర్చున్నాడు. కాగా మొబైల్‌తో ఆడుకున్న తన పిల్లలు బస్సు రాగానే మొబైల్‌ను మరిచి బస్టాండ్‌లోని సీట్లలో వదిలేసి వెళ్లిపోయారు. కాగా బస్సు కోసం బస్టాండ్‌లో వేచియున్న ఓ లెక్చరర్‌కు ఆ మొబైల్ కనపడటంతో డ్యూటీలో ఉన్న స్టేషన్ మేనేజర్ ఎంవీ.చారికి అందజేశారు. ఇంతలోనే ఫోన్ మరిచిపోయిన బాధితులు ఫోన్ చేసి రావడంతో వారికి ఫోన్‌ను అప్పగించారు.

రాష్ట్రస్థాయిలో రాణించాలి : రంగారావు



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

మిర్యాలగూడ టౌన్, జూలై 28: రాష్ట్రస్థాయిలో రాణించి ఉమ్మడి జిల్లాకు పేరు తేవాలని బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తోట రంగారావు అన్నారు. సూర్యాపేట, నల్లగొండ జిల్లా స్థాయి అండర్-13 సెలక్షన్స్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను ఆదివారం అభినందించారు. జిల్లా కోచ్ మారబోయిన రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 8న రాష్ట్ర రాజధానిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఏ సభ్యులు డాక్టర్ ప్రశాంత్, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొనలేం.. తినలేం

● పెరిగిన కూరగాయల ధరలు

చింతపల్లి, జూలై 28: చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్‌కు చెందిన బొడ్డు ప్రభాకర్ ప్రైవేట్ ఉద్యోగి. నెలకు రూ.15వేల సంపాదనతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. కూరగాయలను కొనడానికి రూ.100 తీసుకొని మార్కెట్‌కి పోతే మూడు రకాలు కూడా రాకపోవడంతో దిక్కుతోచక బోరుమంటున్నాడు. కొన్ని రోజులుగా ఆద్యా అదుపు లేకుండా పెరుగుతున్న కూరగాయల ధరలు సామాన్యులను బెంబేలెత్తిస్తున్నాయి. ఏ కూరగాయ కొనాలన్నా విలవిల్లాడుతున్నారు. చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్(మాల్) మార్కెట్ యార్డులో దాదాపు అన్ని కూరగాయల ధరలు కిలో రూ.30నుంచి రూ.60 వరకు పెరిగిపోయాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా జోరు బావుల్లో పూర్తిస్థాయిలో నీరు లేకపోవడంతో పంట దిగుబడి భారీగా తగ్గింది. పలితంగా కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. రోజువారీ సంపాదనలో సగం కూరగాయలకే ఖర్చు చేయాల్సి వస్తోందని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.300తో కూరగాయలు విక్రయిస్తే వారం రోజులకు సరిపోవడం లేదని వాపోతున్నారు.

రైతులకు నష్టం

ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న రైతులు సైతం మార్కెట్‌కు తెచ్చిన కూరగాయలు విక్రయించే పరిస్థితి లేదని ఆందోళన చెందుతున్నారు. రైతులు, వ్యాపారులకు విక్రయిస్తున్న ధరలకు వినియోగదారులకు అందుతున్న ధరలకు భారీగా వ్యత్యాసం ఉంటుందని, సరి చేయాలిగాలే ధరల నియంత్రణ సాధ్యమవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



కూరగాయల ధరలు (కిలోకు)

బీరకాయ	రూ.80
వంకాయ	రూ.45
దొండకాయ	రూ.35
చిక్కుడు	రూ.70
చామగడ్డ	రూ.50
టమాటా	రూ.75
ఆలుగడ్డ	రూ.55
క్యారెట్	రూ.60
బెండకాయ	రూ.30
క్యాప్సికం	రూ.70
గోకరకాయ	రూ.60
ఉల్లిగడ్డ	రూ.60
క్యాలీఫ్లవర్	రూ.65
క్యాబేజీ	రూ.65
పచ్చిమిర్చి	రూ.65

కొనలేకపోతున్నాం



నేను కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నా. ప్రస్తుతం కూరగాయల ధరలు విపరీతంగా ఉన్నాయి. రూ.200తో మార్కెట్‌కు వస్తే అన్ని రకాల కూరగాయలు కొనలేని పరిస్థితి. సంపాదనలో ఎక్కువభాగం కూరగాయలు కొనడానికి ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం ధరల నియంత్రణ చేయపోవడంతో నిరు పేదలు జీవించడం కష్టంగా ఉంది.

బండమీది పాపమ్మ గృహిణి, ఎం.మల్లేపల్లి

నియంత్రణ కమిటీలు ఏం చేస్తున్నాయో



మాకు వెంకటేశ్వరనగర్(మాల్)లో హోటల్ ఉంది. పెరిగిన ధరలతో హోటల్ నిర్వహణ కష్టంగా మారింది. పల్లి ఒక్కసారిగా రూ.60 నుంచి రూ.65 చేరింది. జిల్లాస్థాయిలో ధరల నియంత్రణ కమిటీలు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం స్పందించి నియంత్రణ కమిటీలు ఏర్పాటు చేయటకు చర్యలు తీసుకోవాలి.

గులకుంట తిరుపతయ్యగౌడ్, హోటల్ యజమాని, వీటి నగర్

మోటర్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపు పూర్తి

● సాగర్ జలాశయానికి 53,774 వేల క్యూసెక్కులకు పెరిగిన వరద ● సాగర్ నీటిమట్టం 510.20 అడుగులు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగిస్తున్న సిబ్బంది

పెద్దఅడిశర్లపల్లి, జూలై 28: వేసవిలో హైదరాబాద్ జంట నగరాలకు, జిల్లా తాగు నీటి అవసరాలు తీర్చేందుకు హెచ్ఎండబ్ల్యుఎస్(జల మండలి) ఆధ్వర్యంలో నాగార్జునసాగర్ జలాశయంలోని ఎమర్జెన్సీ ప్రాజెక్టు పరిధిలోని పుట్టంగండి జీరో పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ మోటర్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా అధికారులు ఆదివారం తొలగించారు. శ్రీశైలం ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తి ద్వారా ఆదివారం సాయంత్రం 53,774 క్యూసెక్కుల నీరు రావడంతో నీటినిల్వ 510.20 అడుగులకు చేరింది. నాగార్జునసాగర్ జలాశయం డెడ్‌స్టోరేజీ 510 అడుగుల దిగువకు చేరడంతో హైదరాబాద్ జంటనగరాలకు, నల్లగొండ జిల్లావాసులకు తాగునీరు అందించేందుకు కృష్ణా జలాల సరఫరాకు హెచ్ఎండబ్ల్యూఎస్‌బీ అధికారులు గత ఏప్రిల్ 17వ తేదీన పుట్టంగండి వద్ద కృష్ణానదిలో జీరో పాయింట్ వద్ద 10 మోటర్లను ఏర్పాటు చేసి 900 క్యూసెక్కుల నీటిని పుట్టంగండికి సరఫరా చేసి అక్కడి నుంచి రెండు పంపులతో 800 క్యూసెక్కుల నీటిని ఏకేబీఆర్‌కు తరలించారు. సాగర్‌లో 503 అడుగుల నుంచి సైతం నీటిని తీసుకున్నారు. ఏకేబీఆర్ నుంచి 525 క్యూసెక్కుల నీటిని జంటనగరాలకు, 45 క్యూసెక్కుల నీటిని జిల్లాలోని మిషన్ భగీరథ ట్యాంకులకు సరఫరాచేసి వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇటీవల కృష్ణానది వరదలతో నాగార్జునసాగర్ జలాశయం రోజురోజుకు నీటిమట్టం పెరుగుతుండడంతో గత రెండు రోజులుగా మోటర్లు, పైపులైను, ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా తొలగించినట్లు జలమండలి డీజీఎం వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. తొలగించిన మోటర్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, ఇతర సామగ్రిని కోదండపురం, నసర్లపల్లి, గొడకొండ్ల ప్లాంట్‌లో భద్రపరుస్తామని ఆయన తెలిపారు.

వానొస్తే కురవాల్సిందే..



డార్మెటరీ హాల్ పిల్లర్లకు ఏర్పడిన పగుళ్లు, పైకప్పు నుంచి చేరిన వర్షపునీరు

● నాణ్యత లోపించిన నిర్మాణాలు

నార్కట్‌పల్లి, జూలై 28: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీజడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం గుట్టపై చేపట్టిన డార్మెటరీ హాలు గోడలు, పిల్లర్లు (అడ్డ బీములు) జాయింట్ల వద్ద పగుళ్లు ఏర్పడ్డాయి. పగుళ్ల నుంచి వర్షపు నీరంతా హాల్‌లోకి వస్తుండటంతో భక్తులు కూర్చోవడానికి ఆసౌకర్యంగా మారింది. నాణ్యతా లోపంతో నిర్మాణం వల్లే పగుళ్ల వచ్చాయని భక్తులు ఎత్తి చూపిస్తున్నా దేవదాయ శాఖ ఇంజనీరింగ్ అధికారులు మాత్రం దీన్ని తేలిగ్గా తీసుకుంటున్నారు. చెర్వుగట్టు దేవస్థానంలో అభివృద్ధి పనుల్లో భాగంగా సుమారు రూ.3 కోట్లతో నిర్మిస్తున్న కళ్యాణ మండప విస్తరణ, సాలహారంతో కూడిన డార్మెటరీ హాల్ నిర్మాణ పనులకు గత ప్రభుత్వ హయాంలో 2022 ఫిబ్రవరి 6న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇప్పటివరకు దాదాపు 80 శాతం నిర్మాణం పూర్తి కావచ్చింది. అయితే డార్మెటరీ హాలులో ఉన్న స్లాబ్ జాయింట్ పిల్లర్లు, గోడలకు పలు చోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. వారం రోజులుగా కురిసిన వర్షాలతో పగుళ్ల నుంచి వర్షపు నీరు హాలులోకి చేరి నిల్వ ఉంటోంది. దీంతో భక్తులకు అసౌకర్యంగా మారింది. నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపాలవల్లే ఇలా జరిగిందని భక్తులు విమర్శిస్తున్నారు.

ఇది సహజమే

స్లాబ్ విస్తరణ పనులు చేపట్టినపుడు పిల్లర్ జాయింట్ల వద్ద పగుళ్లు రావడం సహజమే. పనులు ఇప్పటికే కేవలం 80శాతమే పూర్తయ్యాయి. ఇంకా కల్యాణ మండపం చుట్టూ బండలు వేయాల్సి ఉంది. ఇంకా చిన్నచిన్న పనులు చేయాల్సి ఉంది. దేవదాయశాఖ ఇంజనీరింగ్ విభాగం సాంకేతిక నిపుణుడి సూచనలతో పగుళ్లను మూసేస్తాం.

కిరణ్, దేవస్థానం ఏఈ

మంత్రి వెంకట్‌రెడ్డికి హరీశ్‌రావు క్షమాపణ చెప్పాలి

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గండిచెర్వు వెంకన్న గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న గండిచెర్వు వెంకన్న

నల్లగొండ టౌన్, జూలై 28: తక్షణమే హరీశ్‌రావు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిచో రాష్ట్రంలో తిరగకుండా అడ్డుకుంటామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గండిచెర్వు వెంకన్నగౌడ్ అన్నారు. పట్టణంలోని బీసీ సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవిని త్రుణప్రాయంగా వదిలేసి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఆమరణ నిరాహార దీక్ష చేశారని అన్నారు. మాజీమంత్రి హరీశ్‌రావు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. నిరంతరం పేద ప్రజల కోసం తపించే వ్యక్తి వెంకట్‌రెడ్డి అని కొనియాడారు. ఎంతో మంది పేద విద్యార్థులను తన స్వంత డబ్బుతో చదివిస్తూ, ఎంతో మంది పేదలకు వైద్య ఖర్చులు భరిస్తూ వస్తున్నారని అన్నారు. అలాంటి వ్యక్తిని తెలంగాణ ఉద్యమ సమయంలో బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు సంపాదించుకొని శ్రీకాంతాచారి చావుకి కారణమైన మాజీ మంత్రి హరీశ్‌రావు హాఫ్ నాలెడ్జ్ అనడం సిగ్గుచేటని అన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేరేటి మల్లేష్‌యాదవ్, రాష్ట్ర కార్యదర్శి ఈర్ల లింగస్వామియాదవ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చామకూరి శంకర్, పుట్ట రాకేష్, అజయ్, దేవేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ క్యాంపెయినింగ్ జిల్లా కోఆర్డినేటర్‌గా యాదయ్య


యాదయ్య

నల్లగొండ టౌన్, జూలై 28: కాంగ్రెస్ పార్టీ క్యాంపెయినింగ్ జిల్లా కోఆర్డినేటర్‌గా పట్టణంలోని పానగల్లు ప్రాంతానికి చెందిన చాపల యాదయ్యను నియమిస్తూ జిల్లా చైర్మన్ పోలగాని వెంకటేషంగౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం పానగల్లులోని పచ్చల సోమేశ్వరాలయ ఆవరణలో యాదయ్యకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ తన నియమాకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

నార్కట్‌పల్లి, జూలై 28: సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బొల్లు రవీందర్, దండు రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ చేపట్టిన సంక్షేమ హాస్టళ్ల సందర్శన యాత్రలో భాగంగా ఆదివారం మండలంలోని బీ.వెల్లెంల ఎస్సీ బాలికలు, నార్కట్‌పల్లిలోని బీసీ ప్రత్యేక బాలుర హాస్టళ్లలో సర్వే నిర్వహించారు. హాస్టళ్లలో మెనూ పాటించడం లేదని, కరెంటుపోయిన సమయంలో ఇన్వర్టర్లు లేక చదువుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాత్రూంలలో నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఆగస్టు 18 వరకు అంబేడ్కర్ యూనివర్సిటీలో ప్రవేశాలు


నల్లగొండ కల్చరల్, జూలై 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2024-2025 విద్యా సంవత్సరానికి పలు కోర్సుల్లో చేరేందుకు ఆగస్టు 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని నల్లగొండ రీజనల్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ ఆనంతి శ్రీనివాస్ తెలిపారు. యూనివర్సిటీలో బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ, ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, పీజీ, పీజీ డిప్లొమా, పలు సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు అడ్మిషన్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. స్టడీ సెంటర్‌లో చేరడానికి విద్యార్హతలు, ఫీజు, కోర్సులు వంటి వివరాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా ట్యూషన్ ఫీజులు చెల్లించాలని, అంతకు ముందు చేరిన విద్యార్థులు సకాలంలో ఫీజు చెల్లించకపోయినా వారు కూడా ఆగస్టు 18వ తేదీలోగా ఆన్‌లైన్‌ల్లో చెల్లించాలని కోరారు. పూర్తి సమాచారం కోసం అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని, 2015-2016 నుంచి 2023-2024 వరకు అడ్మిషన్ పొంది ఉంటే ట్యూషన్ ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సోమ నర్సింహ

మర్రిగూడ, జూలై 28: జిల్లాలో బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల ఇన్‌చార్జి సోమనర్సింహ అన్నారు. నాంపల్లి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో స్థానిక ఎన్నికల్లో బరిలో నిలిచి బీజేపీ జెండా ఎగరవేసే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యకర్తల కృషి ఫలితమే 8 ఎంపీ స్థానాలు మనం కైవసం చేసుకున్నామని గుర్తు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు దాచేపల్లి నర్సింహ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు శంకర్‌నాయక్, నాయకులు మంటిపల్లి శ్రీశైలం, భాస్కర్‌నాయక్, బీజేవైఎం మండల అధ్యక్షుడు నాంపల్లి సతీష్, హరికుమార్, నాయకులు కాంతరెడ్డి, లాల్యానాయక్, గౌరు వెంకటయ్య, శ్రీశైలం, శ్రీకాంత్, శంకర్, చంద్రశేఖర్, నర్సిరెడ్డి, లింగస్వామి పాల్గొన్నారు.

'అగ్నివీర్' మహేష్ మృతి బాధాకరం


మహేష్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాండురంగారెడ్డి

హాలియా, జూలై 28: జవాన్ ఈరేటి మహేష్ అనారోగ్యంతో మృతి చెందిన బాధాకరమని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి అన్నారు. మండలంలోని మదారిగూడెం గ్రామంలో ఆదివారం మహేష్ చిత్రపటానికి పాండురంగారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.50వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో తిరుమలగిరి సాగర్ మండల మాజీ వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, అనుముల మాజీ ఎంపీపీ సుమతిపురుషోత్తం, జనార్దన్‌రెడ్డి, నడ్డి లింగయ్య శ్రీను, బెడుదూరి వెంకట్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, జనార్దన్, కొత్త వెంకన్న, రిక్కల అచ్చిరెడ్డి, కర్ల హరి, రావుల రామాంజి, నరేష్, రమేష్ పాల్గొన్నారు.

CLASSIFIEDS

ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ లైన్స్

★ లేట్ మ్యారేజ్, సెకండ్ మ్యారేజ్ మరియు ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ చేసుకోవాలని అనుకునే అమ్మాయిలు, అబ్బాయిలు మమ్మల్ని సంప్రః సెల్: 7702279912 సూర్యాపేట, మిర్యాలగూడ

AJY_161869

4 Lines CLASSIFIED

NLG+SRPT+YGT (3Dist)

210/- Only

Extra Line 45/- Only

For Ads Contact :

NALGONDA DIST 9985413656 9985413365

SURYAPET DIST 9703618713, 9985401015

YADADRI BHONGIRI DIST 9177572576

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

సమస్యల చింతపల్లి

- పడకేసిన పారిశుధ్యం
- అధ్వానంగా రహదారులు
- ప్రమాదాలకు నిలయంగా రాష్ట్ర రహదారి
- పుట్టగొడుగుల్లా పుట్టకొస్తున్న సెల్ టవర్లు
- సమస్యలను పరిష్కరించాలని ప్రజల డిమాండ్

చింతపల్లి, జూలై 28: చింతపల్లి మండలం సమస్యలకు నిలయంగా మారింది. పలు సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటిని పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

మూలమలుపులు ప్రమాదానికి పిలుపులు

చింతపల్లి మండల కేంద్రంతో పాటు సాగర్ - హైదరాబాద్ రాష్ట్ర ప్రధాన రహదారి పూర్తిగా మూలమలుపులతో నిండి ఉంది. దీంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్ర యాణికులు, ప్రజలు కోరుతున్నా అధికారులు స్పందించడం లేదు.

మూల మలుపులు ఎక్కడ ఉన్నాయంటే...

వేంకటేశ్వరనగర్ (మాల్) నుంచి పోలేపల్లిరాంనగర్‌కు వెళ్లే దారితో పాటు, మదనాపురం గ్రామశివారులో మూల మలుపు ఉంది. కుర్మేడ్‌గేట్, విరాట్‌నగర్, వింజమూర్, నుంచి చింతపల్లికి వెళ్లే మూలమలుపు అతి ప్రమాదకరంగా మారింది. దీంతో రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై దేవరకొండ డీఈఈ ప్రభాకర్‌ను వివరణ కోరగా రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించి మూల మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు సంబంధించి సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.


వింజమూరు గ్రామశివారులో మూలమలుపు

పడకేసిన పారిశుధ్యం

చింతపల్లి మండల కేంద్రంలోని బీసీ కాలనీతో పాటు గొడకొండ్ల గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. ప్రత్యేక అధికారుల పాలనలో సమస్యలు పేరుకుపోయాయి. డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజును వివరణ కోరగా సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు.

అధ్వానంగా రహదారులు

నాలుగు రోజుల క్రితం ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి గ్రామాల్లోని రహదారులన్నీ చిత్తడిగా తయారై గుంతలమయంగా మారాయి. చింతపల్లి మండలంలోని గొడుకొండ్ల, వెంకటేశ్వరనగర్, ఉమ్మాపురం, వింజమూర్, తిర్మలాపురం, బద్దవారిగూడెం, నసర్లపల్లి, చాకిలశేరుపల్లి, ఎం.మల్లేపల్లి, పి.కే.మల్లేపల్లి తదితర గ్రామాల్లో పూర్తిస్థాయిలో సీసీ ఏర్పాటు చేయకపోవడంతో కురుస్తున్న వర్షాలకు బీటీ రహదారులు పూర్తిగా అస్తవ్యస్తంగా మారుతున్నాయి. ఈ రహదారులకు గుండా నిత్యం వందలాది సంఖ్యలో వాహన చోదకులు, పాదచారులు వెళ్తూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి సమయంలోఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు బిక్కుబిక్కుమనుకుంటూ రాకపోకలు కొనసాగిస్తున్నారు. అధికారులు మట్టి పోసి చదును చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పీఆర్ ఏఈ జీవన్‌సింగ్‌ను వివర ణ కోరగా సొంత నిధులతో రహదారిపై మట్టిపోయించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

నిబంధనలు పాటించాలి

సెల్ టవర్లు ఏర్పాటు చేసే నిర్వాహకులు ప్రభుత్వ అనుమతి పొందిన తర్వాత ఏర్పాటు చేసుకోవాలి. ఊరికి 500 మీటర్ల దూరంగా సెల్ టవర్లు నిర్మించుకోవాలి. జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం.

- విజయ్‌కుమార్, తహసీల్దార్, చింతపల్లి.

పుట్టగొడుగుల్లా..పుట్టుకొస్తున్నాయ్!

చింతపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సెల్‌ఫోన్ టవర్లు పుట్టగొడుగుల్లా పుటుకొస్తున్నాయి.మండలంలోనివెంకటేశ్వరనగర్(మాల్), కుర్మేడ్, చింతపల్లి, వింజమూరు, నసర్లపల్లి, కుర్మపల్లి తదితర గ్రామాల్లోని వివిధ కాలనీల్లో సుమారు 30సెల్‌ఫోన్ టవర్లు ఏర్పాటయ్యాయి. ఇంకా ఏర్పాటు చేసేందుకు ఆయా సంస్థల అధికారులు పంచాయతీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సెల్ తరంగాల వల్ల మనిషిలో నిస్సత్తువ ఆవరించడంతో పాటు ముఖ్యమైన అవయవాల పనితీరుపై ప్రభావం చూపిస్తాయని వైద్య పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. సెల్‌టవర్ల నుంచి వెలువడే రేడియేషన్ వల్ల పెద్దల నుంచి పిల్లల వరకు ప్రజలకు వివిధ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నా టవర్ల తొలింపుల్లో ఆయా సంస్థలు మీనమేషాలు లెక్కిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. గతంలో సెల్‌టవర్ల గురించి తెలియక జనావాసాల మధ్యలో టవర్లు ఏర్పాటు చేసుకున్నామని తెలిసిన తర్వాత టవర్ల తొలిగించమంటే ససేమిరా అంటున్నారని పలువురు వాపోతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నకొద్దీ టవర్ల వల్ల సమస్యలు ఇబ్బందులు కొని తెచ్చుకుంటున్నారని వాపోతున్నారు.

అనుమతి ఇవ్వవద్దని ఫిర్యాదులు



కొత్తగా సెల్ టవర్ల ఏర్పాటుకు గ్రామ పంచాయతీలకు ఎలాంటి అనుమతులు జారీ చేయరాదని ఇప్పటికే పంచాయతీ కార్యాలయాల్లో ఫిర్యాదులు ఉన్నాయి. తమ కాలనీలో సెల్‌టవర్ ఏర్పాటుకు అనుమతి ఇస్తే తీవ్ర పరిణామాలు తప్పవని గొడుకొండ్ల, వెంకటేశ్వరనగర్ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సెల్ టవర్లను పూర్తిగా ఎత్తివేయాలని శివారు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయరంగం నడ్డి విరుస్తున్న కేంద్రం

● రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పశ్య పద్మ



సమావేశంలో మాట్లాడుతున్న పశ్య పద్మ

నల్లగొండ రూరల్, జూలై 28: కేంద్రప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకు రాయితీలు కల్పిస్తూ వ్యవసాయరంగం నడ్డి విరుస్తుందని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పశ్య పద్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని మగ్దూం భవనంలో ఆదివారం నిర్వహించిన రైతు సంఘం సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ రంగానికి మోదీ ప్రభుత్వం సబ్సిడీ తగ్గిస్తుందని, రైతు వ్యతిరేక వైఖరిపై రైతాంగం పోరాటం నిర్వహించాలని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిందని అన్నారు. కేంద్రప్రభుత్వం ప్ర వేశపెట్టిన బడ్జెట్లో 24శాతం ఎరువులపై సబ్సిడీ తగ్గించి మోసం చేసిందని ఆరోపించారు. బడ్జెట్ కేటాయింపుల్లో వ్యవసాయ రం గాన్ని నిర్లక్ష్యం చేసిందని, మద్దతు ధర గ్యారెంటీ చట్టం ఊసే లే దని పేర్కొన్నారు. రైతాంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం తయారుచేసిన డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల కు చట్టబద్ధత కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేసి వ్యవసాయానికి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. నా గార్జునసాగర్ ఎడమకాల్వ ద్వారా నీటిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని అన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మోహినుద్దీన్ అధ్యక్షత వహించిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజ రామచంద్రం, వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, నాయకులు బిల్లా కనకయ్య, దోటి పాండరి, సుదర్శన్‌రెడ్డి, బుర్ర శేఖర్, గోపాల్, శాంత, పద్మ, యాదయ్య, రాజు, వెంకటేశ్వర్‌రావు, మల్లారెడ్డి, రంగారెడ్డి, జనార్దన్‌రెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే ఆరోగ్య సమాజం ఏర్పాటు

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడటౌన్, జూలై 28: అందరి సహకారంతో ఆరోగ్య సమాజం ఏర్పాటు సాధ్యమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నేను- నా మిర్యాలగూడ' నినాదంతో పంద్రాగస్టుకు పట్టణాన్ని చెత్త, ప్లాస్టిక్ రహితంగా మార్చాలన్నారు. పట్టణంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. వన మహోత్సవంలో భాగంగా లక్ష మొక్కలు నాటే కార్యక్రమంపై నియోజకవర్గ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మునిసిపల్, వైద్యారోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. స్వచ్ఛందసంస్థలను భాగస్వామ్యులు చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

● పాత పింఛన్ విధానాన్ని అమలుచేయాలని కోరుతూ సీపీఎస్ ఉద్యోగ సంఘం నాయకులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్ మాట్లాడుతూ పాత పింఛన్‌ను పునరుద్ధణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సురేందర్‌సింగ్, ధర్మానాయక్, సైదులు, సతీష్‌కుమార్, శంకర్, నర్సింహ, పున్నయ్య, సుధాకర్, యోగేందర్ పాల్గొన్నారు.

● గ్రామీణ తపాలా సిబ్బందిని డిపార్ట్‌మెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కోరారు. గ్రామీణ తపాలా సిబ్బంది సమస్యలు పరిష్కరించాలన్నారు. సంఘం ఆలిండియా సెక్రటరీ జనరల్ శివాజీ మాట్లాడుతూ స్ట్రైక్ పేరుతో తొలగించబడిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు వెంకటేశ్వరరావు, యోగేశ్వరరావు, పరమేష్, ఉపేందర్‌రెడ్డి, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

ఇసుక లేకుండానే సీసీ నిర్మాణ పనులు

● ఏఈ ఆదేశాలతో నిలిచిన పనులు


దుకాణ సముదాయం ముందు పోసిన మట్టి

చిట్యాల, జూలై 28: చిట్యాల వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో మార్కెట్ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పనుల్లో నాణ్యత లోపించింది. కాంట్రాక్టర్ తన ఇష్టానుసారంగా పనులు చేయిస్తున్నారు. షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట నిర్మిస్తున్న సీసీ నిర్మాణపు పనులు మరీ అధ్వానంగా చేస్తున్నారు. కాంప్లెక్స్ ముందు పోసిన మట్టిని రోలింగ్ చేయకుండానే సీసీ వేస్తున్నారు. ఇదిలా ఉంటే ఆదివారం ఇసుకకు బదులు రాయిపొడి కలిపి పనులు చేస్తున్నారు. ఈ విషయమై ఏఈ అశోక్‌ను వివరణ కోరగా తాను ఇప్పుడే వచ్చానని, పరిశీలించి పనులు నిలిపివేస్తామని పేర్కొన్నారు. ఏఈ ఆదేశాలతో పనులను నిలిపివేశారు.

పబ్లిక్ ఎజెండా



public agenda

సిబ్బందిని నియమించరూ... శాలిగౌరారం: మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్‌లో నెల రోజులుగా సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. అకౌంటెంట్, ఇద్దరు క్లరికల్ సిబ్బంది బదిలీ అయి నెల కావొస్తున్నా వీరి స్థానంలో ఎవరినీ నియమించలేదని, దీంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందంటున్నారు. మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రీజనల్ అధికారులకు తెలియజేశామన్నారు.

అధికారుల సమాచారం ఏదీ..? పెద్దఅడిశర్లపల్లి: ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం అధికారులకు సంబంధించిన సమాచారం ఉండటం లేదని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు బోర్డులపై రాయించాలని ఆయా సమస్యలపై తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా స్కానింగ్ మిషన్

● ఇబ్బందులు పడుతున్న రోగులు ● పట్టించుకోని అధికారులు


ఉత్సవ విగ్రహంలా ఉన్న స్కానింగ్ మిషన్

మర్రిగూడ, జూలై 28: మర్రిగూడ ప్ర భుత్వాస్పత్రిలో (కమ్యూనిటీ హెల్త్ సెంటర్) గర్భిణులకు, ఇతర వ్యాధులకు స్కానింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన స్కానింగ్ మిషన్ నిరుపయోగంగా మారింది. రేడియోలజిస్ట్ లేకపోవడంతో మిషన్ అలంకారప్రాయంగా మారింది. దీంతో ఆస్పత్రికి వచ్చే రో గులు ఇబ్బందులు పడుతున్నారు. మర్రిగూ డ మండలంలోని 18 గ్రామపంచాయతీల్లో ఉంటున్న నిరుపేద ప్రజల కోసం 30పడకల ఆస్పత్రిని ఎనిమిది నెలల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. ఆ సమయంలో రోగులకు అత్యవసర సమయంలో స్కానింగ్ ద్వారా పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన మిషన్ అందజేసింది కానీ రేడియోలజిస్ట్ వైద్యుడిని ఏర్పాటు చేసి స్కానింగ్ సేవలందడం లేదు. స్కానింగ్ సౌకర్యాన్ని కల్పించాలని ప్రజలు ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై డాక్టర్ దీపక్‌ను వివరణ కోరగా స్కానింగ్ మిషన్ ద్వారా రోగులకు పరీక్షలు చేయడానికి రేడియాలజిస్ట్ లేకపోవడంతో గదిలోనే ఉంచినట్లు తెలిపారు.త్వరలోనే రెడియాలజిస్టులను నియమించి రోగులకు స్కానింగ్ సేవలు అందించాలని ఉన్నతాధికారులు తెలియజేసినట్లు తెలిపారు.

దిగుబడులు సాధించేలా రైతులను ప్రోత్సహించాలి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండటౌన్, జూలై 28: సుస్థిర వ్యవసాయ పద్ధతులతో అధి క దిగుబడులు సాధించేలా రైతులను ప్రోత్సహించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం కోణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర రైతాంగానికి భరోసా ఇచ్చే కృషి కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. కృతిమ మేధస్సు ఉపయోగిస్తూ కృషి పేరుతో రైతులకు తోడ్పాటు అందిస్తున్నందుకు నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ సీఈవో ఎంవీ గోనారెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు మహేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

దేవరకొండ, జూలై 28: ప్రభుత్వం విద్యాశాఖమంత్రిని నియమించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగె వెంకటేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు విద్యాసంస్థల్లో ఆదివారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణలో ప్రైమరీ విద్యా విధానాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్, శ్రవణ్, రాకేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

మిర్యాలగూడ టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అందించే దూరవిద్యను సద్వినియోగం చేసుకోవాలని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ నర్సింగ్ కోటయ్య అన్నారు. ఆగస్టు 18 చివరి తేదీలోగా బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శాలిగౌరారం: రైతులందరికీ వయో పరిమితి లేకుండా రైతు బీమా అమలుచేయాలని ఆమ్‌ఆద్మీ పార్టీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యంపల్ల పురుషోత్తంరెడ్డి కోరారు. రైతుబీమా వయో పరిమితిని పూర్తిగా సడలించి రైతు ఏ వయస్సులో మృతి చెందినా రైతుబీమా ఇవ్వాలని కోరారు. రైతుబీమాను రూ.5 నుంచి 10లక్షల వరకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. పంట రుణం తీసుకున్న ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలన్నారు.

● కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను వెంటనే అమలుచేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు జమ్ము రమేష్ డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల్లో మూడు గ్యారంటీలు అమలుకాలేదన్నారు. ఆసరా పింఛన్లు పెంచలేదని, అర్హులైన వారు దరఖాస్తు చేసినా ఇంతవరకు ఎంపిక చేయలేదన్నారు.

కేతేపల్లి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, రాత్రి వేళల్లో రోడ్లపై హల్‌చల్ చేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఎ.శివతేజగౌడ్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శాంతిభద్రత పరిరక్షణలో ప్రజలు తమకు సహకరించాలని కోరారు.

కట్టంగూరు: కట్టంగూరుకు చెందిన చిలకమర్రి వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పెద్ది ఫౌండేషన్ చైర్మన్ పెద్ది బాలనర్సింహగౌడ్ కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పోగుల నర్సింహ, అంతటి శ్రీను, నోముల వెంకటేశ్వర్లు, రెడ్డిపల్లి మనోహర్, పాడిచేటి సైదులు, ఎరుకల మల్లేష్, నాయకులు పోతులూరు, చిలకమర్రి రవి పాల్గొన్నారు.

చిట్యాలరూరల్ : మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి చెందిన బాలగోని రాజుగౌడ్ తండ్రి నర్సింహ అనారోగ్యంతో మృతిచెందాడు. నర్సింహ మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే లింగయ్య, మునిసిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, జలంధర్‌రెడ్డి, ఆవుల జానయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చిట్యాల రూరల్: మండలంలోని నేరడ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు దుబ్బాక సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సతీశ్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుటుంబసభ్యులు ఇషిత, అమరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

చింతపల్లి: చింతపల్లి మండలం గొడుకొండ్ల గ్రామపంచాయతీలోని వేంకటేశ్వరనగర్‌లో శిలాఫలకంపై ముసుగు వేశారు. ఇటీవల్ల పార్లమెంట్ ఎన్నికల తరుణంలో ఎన్నికల కోడ్ నియమావళి ప్రకారం అధికారులు జెండాలతో పాటు శిలాఫలకాలపై ముసుగువేయాలని ఆదేశించారు. పంచాయతీ సిబ్బంది జెండాలతో పాటు, శిలాఫలకాలపై కనిపించకుండా వస్త్రాలతో కప్పి వేశారు. అధికారులు గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి ముసుగు తీసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కేతేపల్లి: పంచాయతీ కార్మికులు హైదరాబాద్‌లో ఈనెల 30వ తేదీన నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు ఆదిమళ్ల సుధీర్ కోరారు. కేతేపల్లిలో కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయితీ కార్మికులకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి అర్హత కలిగిన వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో పంచాయతీ కార్మికులు జి.ఆశీర్వాదం, కోటయ్య, సైదులు, లింగయ్య, భద్రయ్య, జానయ్య, భిక్షం, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్: పట్టణంలోని రామగిరిలో గల గీతా విజ్ఞాన మందిర్ హైస్కూల్ 2000-2001 పదో తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థులంతా ఒక్క చోటకు చేరి ఆత్మీయంగా పలకరించుకోవడంతో పాటు గత స్మృతులను నెమరవేసుకున్నారు.

సాగర్‌లో ఘనంగా బోనాలు


సాగర్‌లో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

నాగార్జునసాగర్, జూలై 28: నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీలో పో చమ్మ అమ్మవారికి ఆదివారం మహిళలు అధిక సంఖ్యలో బోనాలు సమర్పించారు. ప్రతి ఏటా ఆషాడ మాసం దశమి రోజున నిర్వహించుకునే ఈ బోనాల పండుగను పైలాన్‌కాలనీలో వైభవంగా చేపట్టారు. బంధుమిత్రులతో ఆనందంగా గడుపుతూ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మొక్కులు చె ల్లించుకొని బోనాలు సమర్పించారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని దత్తాశ్రమంలో అనగాష్టమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన దత్తాత్రేయ అభిషేక, వ్రతాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పూజల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పందిరి సత్యనారాయణ, భాగ్యలక్ష్మి, పద్మ, కల్యాణి, భవాని, శారద తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం

చందంపేట: చందంపేట మండల కేంద్రానికి చెందిన కొండ్రపల్లి సైదులు(42) పదేళ్లుగా హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురై సైదులు శనివారం రాత్రి మృతి చెందాడు. ఎస్పీ ఆదేశాలమేరకు ఆదివారం హోంగార్డు వెల్ఫేర్ ఆర్ఐ నరేష్ రూ.10వేలు, చందంపేట మాజీ ఎంపీపీ పార్వతి చందునాయక్ రూ.5వేలు సైదులు కుటుంబ సభ్యులకు అందజేశారు.